సాగుకు అనుసంధానమెప్పుడో?

- ఉపాధిహామీతో అన్నదాతలకు మేలు
- ఏటా వెంటాడుతున్న కూలీల కొరత
- రైతులకు తప్పని పెట్టుబడి భారం


సాగు చేసిన మిరపతోట

రేగొండ : ఆరుగాలం శ్రమించి..రెక్కల కష్టంతో పంట పండించి దేశానికి అన్నం పెట్టి రైతులకు ఏటా సాగు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా సీజన్లలో కూలీల కొరత మరింత వెంటాడుతోంది. ఇది పంట సాగు పెట్టుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలంటూ రైతు సంఘాలు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించాయి. అలాగే నీతి అయోగ్ సైతం అనుసంధానమే అన్నదాతకు మేలని తన నివేదికలో పేర్కొంది.

రైతులపై పెట్టుబడి భారం..
వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే రైతులకు 30 శాతం మేలు చేకూరుతుందని మేధావులు, రాజకీయ అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. కూలీల కొరత అధిగమించడంతో పాటు రైతులకు అనేక రకాల పంటలు పండించేందుకు వీలు కలుగుతుంది. మండలంలో పత్తి, మిరప పంటసాగు విస్తీర్ణమే అధికంగా ఉంటుంది. పంట చేతికి వచ్చిన తర్వాత పత్తి, మిరప కాయలు ఏరేందుకు కూలీల కొరత ఏటా వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో కూలీ పెంపు తప్పనిసరి అవుతోంది. కూలీలను పొరుగున ఉన్న గ్రామాల నుంచి ఆటోలు, ఇతర వాహనాల్లో తీసుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. వారికి కూలీతో పాటు రాను పోను చార్జీలు సైతం రైతులే చెల్లించాల్సి వస్తోంది. అన్నదాతపై పెట్టుబడి భారం.. మరో వైపు గిట్టు బాటు ధర లేకపోవడంతో నష్టాలే మిగులుతు

అనుసంధానిస్తే మేలు..
ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తే రైతులకు మేలు జరుగుతుంది. విత్తనాలు వేయడం, పత్తి, మిరప ఏరడం, పంట సాగులో ఇతరత్రా పనులకు ఉపాధి కూలీలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కూలీలకు సైతం ఏడాది పాటు ఉపాధి దొరుకుతుంది. ఇప్పటికే ఈ పథకం ద్వారా వ్యవసాయంలో పలు పనులు చేర్చారు. పూర్తిస్థాయిలో అనుసంధానిస్తే ఇటు రైతులకు, అటు కూలీలకు లాభం చేకూరుతుంది.

కూలీల కొరత..



ప్రతి సంవత్సరం కూలీల కొరత తీవ్రంగా ఉంటుంది. పత్తి తీయడం, మిరప కాయలు ఏరడం ఇబ్బంది అవుతుంది. సాగు చేసిన రెండు ఎకరాల మిరప తోటలో కాయాలు ఏరడానికి పక్క గ్రామం నుంచి కూలీలను తీసుకు వస్తున్నాను. వారు రావడానికి, వెళ్లడానికి ఆటో చార్జీలు సైతం ఇస్తున్నాను. వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానిస్తే కూలీల కొరత ఉండదు.

– వన్నాల శివాజీ, రైతు, కొత్తపల్లిగోరి

గురుకులాలతో ఉజ్వల భవిష్యత్


కాటారం కూడలిలో ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కాటారం : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు గురుకుల పాఠశాలలో చేరాలని మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బుధవారం ప్రచారం చేశారు. గురుకుల పాఠశాలలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యాబోధన, వసతి, సౌకర్యాలపై ప్రధాన కూడలిలో కరపత్రాలను ప్రదర్శిస్తూ ప్రచారం చేపట్టారు. 5వ తరగతిలో ప్రవేశం, 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు వివరించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానిక మీ సేవా కేంద్రాల్లో విద్యార్థికి సంబంధించి ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, స్టడీ సర్టిఫికెట్ సమర్పించి ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, హరిభూషన్, రాజు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసుల సమస్యలు పరిష్కరించాలి

- వీఆర్‌ఏ జేఏసీ జిల్లా చైర్మన్ హరీశ్


జీఓ పత్రాలు చూపుతున్న చైర్మన్ హరీశ్, వీఆర్‌ఏలు

భూపాలపల్లి రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌ఏ వారసుల సంఘం రాష్ట్ర నాయకుడు, జిల్లా జేఏసీ చైర్మన్ చెన్నపురి హరీశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం భూపాలపల్లిలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో వీఆర్‌ఏలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలు 80 రోజుల పాటు సమ్మె చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి వీఆర్‌ఏ వారసుల జేఏసీ నాయకులతో చర్చలు జరిపి జీఓ 81, 85ను విడుదల చేసిందని గుర్తు చేశారు. జీఓల ప్రకారం 20,583 మందిలో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్మీడియట్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారికి ఆఫీసు సబార్డినేటర్స్ రెవెన్యూతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలో సర్దుబాటు చేసిందన్నారు. మిగిలిన 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని జీఓలో ప్రకటించి, నేటికీ వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం జీఓ 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు తక్షణమే ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని లేనిపక్షంలో వీఆర్‌ఏలంతా ఐక్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ వైస్ చైర్మన్ గడ్డం రమేష్, జనరల్ సెక్రటరీ భూతం రాజు, మధు, రమేష్, సతీష్, బోగి రాజుకుమార్, మేనక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

మల్హర్ : మూడు నెలల నుంచి తమకు జీతాలు రావడం లేదని, వాటిని ఇప్పించాలని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ ఏపీఓ హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ శ్యామ్ సుందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. పెండింగ్‌లో తమ నాయ్యం చేయాలని వారు వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలని వినతి
కాటారం/ రేగొండ : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది బుధవారం కాటారం ఎంపీడీఓ అడ్డూరి బాబు, రేగొండ ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు ఈజీఎస్ సిబ్బంది బుధవారం వినతిపత్రం అందజేశారు. నిత్యావసరాల కొనుగోలు, ఆస్పత్రుల ఖర్చుల కోసం అప్పులు చేసి నెట్టుకొస్తున్నామని ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని సీఎం, శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేసినప్పటికి ఉన్నత అధికారుల నిర్లక్ష్యం మూలంగా నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. సీఎం, మంత్రులు చొరవ చూపి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు చెల్లించడంతో పాటు ప్రతి నెల ఒకటిన జీతాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


అన్నప్రాసనలో పాల్గొన్న మహిళలు, పిల్లలు

భూపాలపల్లి రూరల్ : గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని నాగారం డిస్పెన్సరీ డాక్టర్ అనూష సూచించారు. బుధవారం నాగారంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ రజిత ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు కార్యక్రమానికి అనూష ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు తగిన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు.వివిధ వయస్సుల వారికి కొలతల ప్రకారం సమతుల ఆహారం పిల్లలకు తినిపించినప్పుడు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలోఅంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, టీచర్ స్వర్ణలత, సరిత, పిల్లల తల్లులు, గర్భిణులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి

కాళేశ్వరం : ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు..వేల గొంతుకలు మహాసభకు నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం కాళేశ్వరంలోని ప్రధాన కూడలిలో డప్పు మోగిస్తూ సభను విజయవంతం చేయడానికి కాళేశ్వరంలోని గ్రామ మాదిగలు, మాది ఉప కులాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వర్గీకరణలు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జిల్లేల నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ హామీలతో కాంగ్రెస్ మోసం

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి

పలిమెల : ఎన్నికలకు ముందు అమలుకాని బోగస్ హామీల ఇచ్చి ఏడాది కాలం పాలన పూర్తయినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి విమర్శించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలు అంటూ ప్రజలకు ఆశ కల్పించి తీరా మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేయడంతో వారి ఆశలపై నీళ్లు చల్లారని, కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా కాంగ్రెస్ పాలన, సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఉందని ఆయన ఉద్దేవా చేశారు. సర్వేలని, గ్రామసభ పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఓట్ల కోసం కాంగ్రెస్ వాళ్లు వస్తే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలయ్యే వరకు బీఆర్‌ఎస్ పక్షాన ప్రజల కోసం పోరాడుతామని తిరుపతి పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రాజయ్య

మల్హర్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకున్న తహసీల్దార్ రవికుమార్‌ను కాంగ్రెస్ నాయకుడు, కాళేశ్వరం ఆలయ మాజీ డైరెక్టర్ బండి రాజయ్య, మాలమహానాడు నియోజక వర్గ కోకన్వీనర్ లింగాల సురేష్ సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రవికుమార్‌ను వారు శాలువాతో సత్కరించి, అభినందించారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కాటారం : మహాముత్తారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 3న గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఉత్సవ విగ్రహాలకు డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఆయా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కులపెద్దలు పాల్గొన్నారు.

నియామకం

భూపాలపల్లి రూరల్ : బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ మండల కమిటీని నియమించినట్లు ఆ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ క్యాతం మహేందర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడిగా బండి రమేష్, టేకుమట్ల మండల అధ్యక్షుడిగా చిలక సమ్మయ్య, మహాముత్తారం మండలానికి దండే కృష్ణను నియమించి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాద్ ఫెడరేషన్ నాయకులు రాజు, రామకృష్ణ, భిక్షపతి, లక్ష్మణ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవింగ్ లైసెన్స్ అందజేసిన ఎస్సై సందీప్ కుమార్

రేగొండ : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్ లేని ప్రయాణం, అతి వేగం ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 10 మంది వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై దివ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘గద్దర్‌పై వ్యాఖ్యలు సరికాదు’


మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

మల్హర్ : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను మల్హర్ మాల మహానాడు మండల కమిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలపై బండి సంజయ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల కన్వీనర్ పసుల పోచయ్య, జిల్లా కోకన్వీనర్ గడ్డం ముత్తయ్య, మండల కో కన్వీనర్ వేల్పుల పోచయ్య, నాయకులు గడ్డం పోచయ్య, నారా రాజేష్, ఎడ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

పథకాల అమలులో కేంద్రం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు


సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

భూపాలపల్లి అర్బన్ : పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. అభివృద్ధికి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని, సింగరేణి, బొగ్గు గనులు, విద్యుత్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని, బొగ్గు విద్యుత్ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం కుట్ర చూపిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెలిశెట్టి రాజయ్య, గుర్రం దేవేందర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సాయిలు
సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బందు సాయిలును నియమించారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభలలో సాయిలు రాష్ట్ర కమిటీ సభ్యుడీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

త్వరగా రుణమాఫీ చేయాలి


డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : రైతులకు సంబంధించిన రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలు కూడా త్వరగా మాఫీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాల రైతు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, క్షేత్ర స్థాయిలో పూర్తిగా రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలనే మాఫీ చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల రుణాలను మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాజయ్య హెచ్చరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీష్, మండల అధ్యక్షుడు మంత్రి రాజబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్య తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్ : పదో తరగతి విద్యార్థిని అకారణంగా చెవిపై చేతితో కొట్టిన భూపాలపల్లి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు సోలంకి రాణి, రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోలంకి రజిత సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. గణిత సబ్జెక్టు బోధిస్తున్న క్రమంలో హెచ్‌ఎం ఝాన్సీరాణి అకారణంగా తమ కూతురు రజిత ఎడమ చెవిపై చేతితో కొట్టడంతో చెవి భాగం నుంచి రక్తం వచ్చి అస్వస్థతకు గురై కిందపడిపోయిందని తెలిపారు. ప్రస్తుతం స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని పేర్కొన్నారు. తమ కూతురును ఎందుకు కొట్టారని ప్రశ్నిస్తే హెచ్‌ఎం తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఇదే విషయమై హెచ్‌ఎం ఝాన్సీరాణిని వివరణ కోరగా విద్యార్థిని కొట్టలేదని, అస్వస్థతకు గురైతే వెంటనే రజితకు నీరు తాగించి, పెరుగు అన్నంతో భోజనం చేయించి, తాము ఇంటికి పంపించామని పేర్కొన్నారు.

ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనం అందించాలి

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు గౌరవ వేతనాన్ని అందించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు.ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ జయశ్రీకి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేసి, ఆన్‌లైన్ చేసిన వారికి ప్రభుత్వం గౌరవ వేతన నిధులు విడుదల చేసినా ఇప్పటి వరకు ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనాన్ని అందించపోవడం సరైంది కాదన్నారు. అధికారులు స్పందించి సమగ్ర కుటుంబ సర్వేలో శ్రమించిన ఎన్యుమరేటర్లకు వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

బైక్ అదుపు తప్పి ఇరువురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం


క్షతగాత్రుడు సమ్మయ్య

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం కాటారం మండలానికి చెందిన కొండపర్తి సమ్మయ్య తన కుమారుడు రమేశ్ బైక్‌పై మహదేవపూర్ మండలం సూరారం వెళ్లి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు సరిగ్గా లేక బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో సమ్మయ్యకు బలమైన గాయాలు కాగా, రమేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి సమ్మయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..
రేగొండ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడిపల్లి గ్రామానికి చెందిన పత్తి కృష్ణారెడ్డి తన ద్విచక్ర వాహనంపై పరకాలకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ కృష్ణారెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలవడంతో 108వాహనంలో చికిత్స నిమిత్తం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలి

- వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రేగొండ : బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలని ముదిరాజ్ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు మారబోయిన ధనుంజయ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2వ తేదీన వరంగల్‌లో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరీకి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు బమ్మ తిరుపతి, నిమ్మల రాజు, దండెబోయిన సంతోష్, సాదు నగేష్, వనం నరేష్, ఈర్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

కాటారం : మండలంలోని మీనాక్షి, రుద్ర జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్ల నేడు(గురువారం) నుంచి తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి లాషరీఫ్ ఒక ప్రకటనలో తెలిపా రు. ఆయా పత్తి మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో జిన్నింగ్ అయ్యేంత వరకు కొనుగోళ్ల నిలిపివేయాలని సీసీఐ అధికారులు లేఖ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

‘గ్రీన్‌ఫీల్డ్’ రైతులతో సమావేశం



మొగుళ్లపల్లి : మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూములు కోల్పోతున్న మొగుళ్లపల్లికి చెందిన రైతులతో కలెక్టర్ సూచనల మేరకు ఆర్డీఓ రవి బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి విలువను పెంచడానికి ఆర్బిట్రేషన్ కోసం పిటిషన్ దాఖలు చేయడంలో పరిహారం అందుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు.తహసీల్దార్ సునీత, ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి : మండల కేంద్రానికి చెందిన లడే రాజేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రాజేశ్వర్‌రావు మృతదేహన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి, సానుభూతి తెలిపారు. ఆయన వెంట జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, చిట్యాల మార్కెట్ మాజీ చైర్మన్ కొడారి రమేష్, జెండా రాజేష్, ధర్మారావు, లక్ష్మణ్, రమేష్, ఆరె సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి కొమురయ్య, మండల కేంద్రానికి చెందిన బుర్ర నవ్య, సామాల జగన్నాథం ఇటీవల మృతి చెందారు.కాగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ బుధవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

భర్తను చంపిన భార్య అరెస్ట్

భూపాలపల్లి అర్బన్ : అక్రమ సంబంధానికి అడ్డుపడుతున్నాడని భోజనంలో పురుగుల మందు పెట్టి భర్తను హత్య చేసిన కేసులో భార్యను అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో కాశీంపల్లి గ్రామానికి చెందిన కందుల సురేష్‌కు అతడి భార్య స్వప్న ఈ నెల 26వ తేదీన రాత్రి భోజనంలో పురుగుల మందు కలిపి తినిపించినట్లు తెలిపారు. అనంతరం ముఖంపై బొంతతో అదిమి చంపినట్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి బుధవారం లొంగిపోయి నేరాన్ని అంగీకరించిందని పేర్కొన్నారు. అక్రమ సంబంధానికి భర్త అడ్డుపడుతున్నాడని హత్య చేయడం జరిగిందని వివరించారు.

పేకాటరాయుళ్లు..



కాటారం : మహాముత్తారం మండలం సింగారం శివారులో పేకాట స్థావరంపై బుధవారం సాయంత్రం పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఏడుగురిని పట్టుకొని రూ.5,340 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

జూకల్‌లో..
చిట్యాల : మండలంలోని జూకల్‌లో బుధవారం ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు రెండో ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సూర సాదయ్య ఇంట్లో ఏడుగురు పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, రూ.4,950ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఈశ్వరయ్య పేర్కొన్నారు.

సన్మానం

మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చెన్నూరి సత్యనారాయణ బుధవారం ఉద్యోగ విరమణ పొందగా ఆత్మీయ సన్మాన సమావేశం ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈఓ లింగాల కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్యనారాయణ వృత్తిలో భాగంగామంచి ఉపాధ్యాయుడిగా ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు.